క్లుప్తంగా

ఉద్యోగాల భర్తీలో వైఫల్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాలకు సకాలంలో నోటిఫికేషన్లు విడుదల చేసి, ఉద్యోగ నియామక పరీక్షలను నిర్వహించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కృష్ణా– గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. పొన్నూరు రోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

సిలంబం పోటీల్లో ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఇండియన్ సిలంబం ఫెడరేషన్ నిర్వహించిన జాతీయస్థాయి సిలంబం చాంపియన్‌షిప్–2024లో మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలను కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ తెలిపారు. శనివారం లక్ష్మీపురంలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సెబాస్టియన్ మాట్లాడుతూ గత నెల 27న శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో నిర్వహించిన జాతీయస్థాయి కర్ర సాము పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని వి.హన్సివి మీనాక్షి, 8వ తరగతి విద్యార్థి వి.వైదిక్ సత్తా చాటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెటరన్ అథ్లెటిక్స్‌లో దంపతుల సత్తా

గుంటూరు ఎడ్యుకేషన్: మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయస్థాయి వెటరన్ అథ్లెటిక్స్‌లో గుంటూరు నగరానికి చెందిన జైహింద్ గురుజీ(80), సుబ్బాయమ్మ(70) దంపతులు సత్తా చాటారు. శనివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ఇచ్చిన ఆర్.శివాజీ మాట్లాడుతూ 100, 200, 400, 800 మీటర్ల పరుగులో జైహింద్ బంగారు పతకాలు సాధించగా, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో సుబ్బాయమ్మ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. 80 ఏళ్ల వయసులో జైహింద్, 70 ఏళ్ల వయసులో సుబ్బాయమ్మ జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషమని, యువ క్రీడాకారులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మన దేశ పూర్వ వాలీబాల్ కెప్టెన్ సింగారావు, గుంటూరు జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

టెన్నిస్‌లో విన్సెంట్..

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో నిర్వహించిన అంతర్ జిల్లాల టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో అండర్–14 విభాగం నుంచి భారత్‌పేట నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె. విన్సెంట్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె. సుజాత తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి గర్వకారణమన్నారు.

కార్తిక మాస పూజలు

నగరంపాలెం: శివునికి ప్రీతిపాత్రమైన కార్తిక మాసం శనివారం ప్రారంభమైంది. భక్తులు తెల్లవారుజాము నుంచి గుంటూరు నగరంలోని శివాలయాలకు భారీగా తరలివచ్చారు. ముక్కంటికి విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

ప్రభుత్వ పన్నులు సక్రమంగా చెల్లించాలి

నగరంపాలెం: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ కార్యాలయంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు ప్రాంతీయ అధికారి డి.సూర్య శ్రావణకుమార్ నేతృత్వంలో నగరంలోని పలు పార్కుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో అవగాహన సదస్సు నిర్వహించగా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు సక్రమంగా చెల్లించాలని, అవినీతి, కల్తీలు నివారించడంపై అవగాహన కల్పించారు. అనంతరం దేశ శ్రేయస్సు కోసం సమగ్రత, సంస్కృతి అంటూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో డీఈఈ అల్లాడి శ్రీనివాస్, సీఐలు కె.చంద్రశేఖర్, పి.శివాజీ, గ్రామీణ నీటిపారుదల ఎస్ఈ కళ్యాణ్‌చక్రవర్తి, పంచాయతీరాజ్ ఎస్.ఈ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సీనియర్ విభాగంలో 22, జూనియర్ విభాగంలో 12 టీంలు పాల్గొన్నాయి. సీనియర్స్‌లో కొండవీడు పబ్లిక్ స్కూల్, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్, నల్లపాడులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, జూనియర్స్‌లో కొండవీడు పబ్లిక్ స్కూల్, సెంట్రల్ పబ్లిక్ స్కూల్, భారతీయ విద్యాభవన్ టీంలు వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు, భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు సీహెచ్ చలమయ్య, కార్యదర్శి టీఎస్ రాజశేఖర్, ఆర్థిక కార్యదర్శి కె. శ్రీనివాస్, కన్వీనర్ టి. కాశీప్రసాద్ పాల్గొన్నారు.

అన్నీ మర్చిపోతున్నారంటే...

అల్జీమర్స్... బీ కేర్‌ఫుల్

వ్యాధి సోకితే తమ పేరుకూడా మర్చిపోతారు

- పెరుగుతున్న వ్యాధి బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- నవంబర్ నెల అల్జీమర్స్ అవగాహన నెల

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల మతిమరుపు బాధితుల సంఖ్య ప్రతిఏడాది పెరిగిపోతుంది. వయస్సు పెరుగుతున్న కొద్ది మతిమరుపు రావటం సహజం. దీనినే అల్జీమర్స్ వ్యాధి అంటారు. ఆరోగ్య సంస్థల నివేదిక ప్రకారం ప్రతి 32 సెకన్లకు ఒకరు ఈవ్యాధి బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జబ్బు సోకిన వారికి సహాయకులుగా ఉండేవారికి అవగాహన కల్పించటం కోసం 1983 నుంచి ప్రతి ఏడాది నవంబర్ నెలను అల్జీమర్స్ అవగాహన నెలగా నిర్వహిస్తున్నారు.

ఎలా వ్యాధి బారిన పడుతున్నారంటే..

ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి కొంతదూరం వెళ్ళాక ఇంటి అడ్రస్ మర్చిపోవటం, తన పేరు కూడా రోగి మర్చిపోయే స్థితికి చేరుకోవటం ఈ జబ్బు లక్షణం. ఆధునిక జీవనశైలి వలన ప్రతి విషయాన్ని కూడా స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్స్‌లో ఆన్‌లైన్‌లోనే వెతుకుతూ మెదడును ఏ మాత్రం వాడకుండా లేజీగా వదిలివేయటంతో వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వ్యాధి వచ్చాక బాధపడటం కంటే రాకుండా ముందస్తుగా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం చాలా ఉత్తమం. నియంత్రణే తప్పా నివారణ లే నిది ఈ వ్యాధి.

వ్యాధి లక్షణాలు...

అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు తమ పేరు కూడా మర్చిపోతారు. బంధువుల, కుటుంబ సభ్యుల పేర్లు మర్చిపోవటంతోపాటుగా వారిని గుర్తించటం కూడా కష్టమే. ఈ వ్యాధి ఎక్కువగా 60 సంవత్సరాలు దాటిన వారిలో వస్తోంది. నేడు 40 ఏళ్ల వారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపించటం ఆందోళన కలిగిస్తోంది.



అల్జీమర్స్ మాసం పోస్టర్

వ్యాధి రావటానికి కారణాలు....

వ్యాధి రావటానికి జన్యుపరమైన కారణాలు, కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే వారసత్వంగా వచ్చే అవకాశం ఉంది. జీవనశైలిలో మార్పులు, నిద్రలేమి, ఒత్తిడికి గురవ్వటంతోపాటుగా బీపీ, షుగర్, గుండెజబ్బు లాంటి దీర్ఘకాలిక వ్యాధి బాధితులతో వ్యాధి బారిన పడుతున్నారు.

రోజువారి పనులు కష్టమే....

వ్యాధి గ్రస్తులు రోజు వారి కార్యక్రమాలు మర్చిపోతారు. స్నానం చేయటం, బ్రష్ చేయటం, తిండి తినటం కూడా మర్చిపోతారు. వస్తువులను ఎక్కడో పెట్టి ఆ విషయాన్ని మర్చిపోయి ఎవరో దొంగిలించినట్లుగా అనుమానించటం, చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పటం, వస్తువుల పేర్లు మర్చిపోవటం, వాటిని ఏ విధంగా వినియోగించాలో, ఎందు నిమిత్తం వినియోగించాలో అనే అంశాలను మర్చిపోవటం రోగిలో కనిపిస్తాయి.

ఇంటికి తాళాలు వేయటం, కూరలో ఉప్పువేయటం, పాలల్లో తోడు వేయటం వంటివి మర్చిపోవటం వ్యాధి గ్రస్తుల్లో కనిపిస్తాయి.

జీజీహెచ్‌లో మెమరీక్లినిక్...



అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులకు జీజీహెచ్ న్యూరాలజీ ఓపీ వైద్య విభాగంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రతిరోజూ పది మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. వ్యాధిని పెరగనీయకుండా చేయటం తప్పా పూర్తిగా తగ్గించేందుకు మందు లేదు. జిల్లాలో 25 మంది న్యూరాలజిస్టులు ఉండగా ప్రతిరోజూ ఒక్కొక్కరి వద్ద ఇరువురు అల్జీమర్స్ చికిత్స కోసం సంప్రదిస్తున్నారు.

–డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరాలజీ వైద్య విభాగాధిపతి, జీజీహెచ్.

ముందు జాగ్రత్తలే మేలు.....



వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఏదైనా కొత్త విషయాలపై ఆసక్తి చూపాలి. పుస్తకాలలో, న్యూస్ పేపర్స్‌లో, మ్యాగ్‌జైన్‌లలో కనిపించే ఫజిల్స్‌పూర్తి చేయాలి, హాబీలు కొనసాగించటం, బీపీ, షుగర్‌లను అదుపులో పెట్టుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, మత్తుపదార్థాల జోలికివెళ్లకుండా ఉండటం, క్రమం తప్పకుండా ఆహారపు అలవాట్లు పాటించటం ద్వారా ఈవ్యాధి దరిచేరనీయకుండా చేయవచ్చు.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్టు, గుంటూరు

దశలవారీగా ఆక్రమణలు తొలగింపు



నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్ల మీద ఆక్రమణలను దశలవారీగా తొలగిస్తామని, అమరావతి రోడ్ ఇరువైపులా ఆక్రమణలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగిస్తున్నామని, ఆక్రమణలు తొలగించిన వెంటనే డ్రెయిన్లలో పూడిక కూడా తీయాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ లాడ్జి సెంటర్ నుంచి హోసన్నా మందిరం వరకు చేపట్టిన డ్రెయిన్, రోడ్ ఆక్రమణల తొలగింపు పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్ సత్యనారాయణ, ఏఈ చైతన్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు దరఖాస్తుల పరిశీలన

నెహ్రూనగర్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న ఓటర్ల దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్‌ఓలు ఆదివారం నుంచి వస్తారని అవసరమైన పత్రాలు అందించి సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటరుగా అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో ఫారం–18 ద్వారా దరఖాస్తు చేశారని, ఆయా దరఖాస్తులను క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్‌ఓలు వస్తారని తెలిపారు.

ఉరిమే ఉత్సాహం



దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు



హాజరైన నాయకులు, కార్యకర్తలు



కాకాని రోడ్డులో యువకుల బైక్ ర్యాలీ

వైఎస్సార్ సీపీ శ్రేణులు నగరంలో కదంతొక్కాయి. నగరం పులకించిపోయింది. పార్టీ అగ్రనాయకులు రాకతో ఉత్సాహం ఉరకలెత్తింది. అడుగడుగునా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఆనందోత్సవాల మధ్య వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా వనమా బాలవజ్రబాబు ప్రమాణస్వీకారం చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

6న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నవంబర్ 6 తేదీన కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ధర్నా పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థి దీవెన వసతి దీవెనలు వెంటనే విడుదల చేయాలని, జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులకు మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను రూ.3,000లకు పెంచాలని, మెడికల్ సీట్ల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని, 107,108, జీఓలను వెంటనే రద్దు చేయాలని కోరారు. గుంటూరు నగరంలోని కోడిగుడ్డు సత్రం హాస్టల్ వెంటనే ప్రారంభించాలని, కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు ఆదివారం, ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లో కళాశాలలు నిర్వహించకుండా చూడాలని డిమాండ్లతో కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్కే సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి యశ్వంత్, ఉదయరాజు, గోపి పాల్గొన్నారు.

ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ

నెహ్రూనగర్: ప్రజలకు ప్రభుత్వ సేవలను నిర్దేశిత గడువులోగా అందించడంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. తాగునీటి ట్యాప్ కనెక్షన్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై ముగ్గురు ఏఈలు, నలుగురు వార్డ్ అడ్మిన్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీలను అధికారులు తప్పనిసరిగా సర్వీస్ లెవల్ అగ్రిమెంట్(ఎస్ఎల్ఏ) మేరకు నిర్దేశిత గడువు 15 రోజులులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను ఎస్ఎల్ఏ లోపు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఏఈలు పి.వెంకటేశ్వరరావు, కె.సాంబశివరావు, బి.చైతన్యలకు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులు వి.రాంబాబు నాయక్, ఎస్.నాగరాజు, ఎ.వెంకటేశ్వర్లు, ఎన్.వేణుగోపాల్ రావులకు క్రమశిక్షణ చర్యలు, పెనాల్టీ విధింపు ఎందుకు చేపట్టకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు.

పేద, అనాథలకు పౌష్టికాహారం పంపిణీ



నిత్యావసరాల కిట్లు పంపిణీ చేస్తున్న విజయరాణి, సాల్మన్‌రాజు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని, పేద విద్యార్థుల చదువులు, కుటుంబ అవసరాల అభివృద్ధి కోసం ల్యాంప్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఉపయుక్తంగా ఉంటాయని బుద్ధా కిడ్స్ డైరెక్టర్ విజయరాణి అన్నారు. శనివారం జోసెఫ్‌నగర్, కేవీపీ కాలనీలోని జెడ్పీ హైస్కూల్లో పేద అనాథ, దివ్యాంగ బాల, బాలికలకు న్యూట్రిషన్ సపోర్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, ల్యాంప్ సంస్థ సేవలను ఉపయోగించుకుని, కలలను సాధించుకోవాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ దివ్యాంగ బాలలు, పేద విద్యార్థులను ఉన్నత స్థితిలో నడిపించడంతో పాటు కుటుంబాలను అభివృద్ధి చేయడమే సంస్థ ధ్యేయమని అన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ వేంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద, అనాథ పిల్లలు, కుటుంబాల కోసం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా 30 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాంపు సంస్థ కార్యాలయ మేనేజర్ బాజీ, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.దేవపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్తిక సందడి

కార్తిక మాసం ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. మహిళలు దీపాలు వెలగించి పూజలు చేశారు. నగరంలో కార్తిక సందడి సంతరించుకుంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



అరండల్‌పేట శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, దర్శించుకుంటున్న భక్తులు



పాత గుంటూరు శివాలయంలో క్యూలైనులో భక్తులు

ఘనంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి

లక్ష్మీపురం: తెలుగులో తిరిగి పోతన కవిత్వాన్ని స్ఫురణకు తెచ్చిన భావ కవి చక్రవర్తి, వక్తగా, మానవతావాదిగా, దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒక విశిష్ట స్థానం సంపాదించుకున్నారని సినీ దర్శకుడు కె.జయకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం అవగాహన మనము పాడుదాం! రండి బృందం ఆధ్వర్యంలో కవి చక్రవర్తి కృష్ణశాస్త్రి జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ సీనియర్ సభ్యులు ఇ. భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు నగరానికి ఉపయోగపడని రాజధాని

రాజధాని మూలంగా గుంటూరు నగరానికి ఉపయోగం లేకుండా పోయిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం విడిపోయి పది సంవత్సరాలు గడిచినా గుంటూరు నగరంలో ఉన్న సుమారు 12 లక్షల జనాభాకు కనీస పౌర సదుపాయాలు లేవన్నారు. ఒక రవాణా వ్యవస్థ లేదని,అనువైన అంతర్గత రహదారులు లేవని ఆరోపించారు.

రాజధానికి వేల ఎకరాలు అవసరం లేదు..

లక్ష్మీపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రుషికొండ ప్యాలెస్ పేరుతో వ్యాఖ్యనిస్తూ దాని ఖర్చు గురించి ఆశ్చర్యపోతున్నారని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత ఖర్చు అవసరమా అని ప్రశ్నించిన చంద్రబాబు నాయుడు చిన్న రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు 33 వేల ఎకరాల కోర్ రాజధాని ఎందుకు అవసరమో చెప్పాలని డిమాండ్ చేశారు.

హాస్టల్ వాచ్‌మెన్‌ను విధుల నుంచి తొలిగించాలి

లక్ష్మీపురం: పెదనందిపాడు మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో ఉంటూ జెడ్పీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై వాచ్‌మెన్ దాడి చేయడాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ ఖండించారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారుల వైఫల్యం వలనే ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి అమర్నాథ్, నగర అధ్యక్షులు సాయి పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో గందరగోళాన్ని నివారించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో నెలకొన్న గందరగోళాన్ని నివారించాలని కృష్ణా– గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరుగా దరఖాస్తు చేసే సమయంలో కొన్ని చోట్ల టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు కావాలని అధికారులు అడుగుతున్నారని, పలు చోట్ల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినప్పటికీ విచారణకు వచ్చిన సమయంలో గెజిటెడ్ అధికారి సంతకం కావాలని అడగడంతో గందరగోళం నెలకొందని పేర్కొన్నారు. జీవోలో పేర్కొన్న మార్గదర్శకాలు వేరే విధంగా ఉన్నాయని, దీనిపై తాను జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం స్పందించి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.